క్లుప్తంగా

పలువురికి పరామర్శ



స్విమ్స్‌లో సురేష్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని చిప్పారపల్లికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కారేటి సురేష్‌రెడ్డి, వెదురుకుప్పం మండలంలోని పచ్చికాపల్లం గ్రామానికి చెందిన చంద్రారెడ్డి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసి మాజీ ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి ఆస్పత్రికి వెళ్లి సురేష్‌ను పరామర్శించారు. అనంతరం వైద్యాధికారులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మండల పార్టీ కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు మోహన్‌శెట్టి, జేసీఎస్ కన్వీనర్ హరికృష్ణ తదితరులు ఉన్నారు.

1008 కొబ్బరికాయలకు పూజలు



అభిషేకానికి సిద్ధంగా కొబ్బరి కాయలు

నగరి: మున్సిపల్ పరిధిలోని కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయంలో సోమవారం 1008 కొబ్బరి కాయల పూజలు నిర్వహించారు. వేసవి తీవ్రత తగ్గి వర్షాలు పడాలని 1008 కొబ్బరికాయల నీళ్లతో చంద్రమౌళీశ్వరుడికి అభిషేకం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు కొబ్బరి నీటితో స్వామికి అభిషేకం చేశారు. విచ్చేసిన భక్తులకు ఆలయం వద్ద అన్నదానం చేశారు.

వ్యక్తికి రిమాండ్

పెనుమూరు(కార్వేటినగరం): మామపై దాడి చేసిన కేసులో అల్లుడికి రిమాండ్ విధించారు. ఎస్‌ఐ రామచంద్రయ్య కథనం మేరకు వివరాలిలా.. మండల పరిధిలోని మట్టంపల్లికి చెందిన రామ్మూర్తి ఆచారి కుమార్తె జ్యోష్ణను చిత్తూరుకు చెందిన నాగరాజు ఆచారికి ఇచ్చి వివాహం చేశారు. అయితే గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో చిత్తూరు మహిళా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే నాగరాజు ఆచారి తన భార్య పేరిట ఉన్న ఆస్తి కోసం సోమవారం మట్టంపల్లికి వచ్చి భార్యతో గొడవకు దిగాడు. అయితే జ్యోష్ణ తండ్రి రామ్మూర్తి ఆచారి ప్రశ్నించడంతో కత్తితో దాడి చేశాడు. చేతికి రక్తగాయాలు అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చిత్తూరు కోర్టుకు తరలించగా నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.


వాల్‌పోస్టర్లు విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏపీజీఈఏ నేతలు

పుత్తూరు: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మూడవ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జూన్ 5వ తేదీ విజయవాడలో జరుగుతుందని జిల్లా సంఘ నాయకులు పురుషోత్తంరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఉద్యోగి సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కృపాలక్ష్మితో ముస్లిం నేతల భేటీ



కృపాలక్ష్మితో మాట్లాడుతున్న ముస్లిం నేతలు

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మిని కార్వేటినగరం ముస్లిం నాయకులు సోమవారం విజయవాడలోని ఆమె స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కూటమి ప్రభుత్వం ముస్లిం నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ సమన్వయకర్తను కలిసిన వారిలో మండల వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకులు తౌఫీర్ అలీ, రఫీ, ముస్తాక్, అమీనుల్లా, షామీర్, ఇర్షాద్‌ఖాన్, మణిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థికాభివృద్ధి దిశగా స్త్రీనిధి

పాలసముద్రం: రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు సత్వర రుణాలను అందిస్తూ లాభాల బాటలో నడుస్తున్న ఏకైక సహకార సంస్థ స్త్రీనిధి, ఉన్నతి అని ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి తెలిపారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో తమ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం మరిన్ని ఎక్కువ రుణాలు అందించేలా స్త్రీనిధి సంస్థను మెరుగు పరిచే బాధ్యత మహిళలపై ఉందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ఏర్పాటు చేసిన ఉన్నతి, స్త్రీనిధి సంస్థకు పూర్తిస్థాయి యజమానులు మహిళలేనని తెలిపారు. బ్యాంకు లింకేజీ రుణాలను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్రలు పాల్గొన్నారు.

నీరు.. పోరు

- స్వచ్ఛ నీరు రాదు.. రసాయన నీరు పోదు
- నిధుల కొరతే కారణమంటూ చేతులెత్తేస్తున్న అధికారులు
- నగరి మున్సిపాలిటీకి ఆదాయం బెత్తెడు.. ఖర్చులు మూరెడు
- నీటి సమస్య ఉండదన్న కూటమి హామీ కాగితాలకే పరిమితం
- సమస్యలతో సహవాసం చేస్తున్న జనం





పనిచేయక రసాయననీటితో నిండిన సీఈటీపీ ప్లాంటు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో పేరుకుపోయిన చెత్తకుప్పలు

నగరి: మున్సిపాలిటీని నిధుల సమస్య వేధిస్తోంది. దీంతో ఏ పనులూ ముందుకు సాగడం లేదు. తాగు నీటి సమస్య పరిష్కారానికి పైపు లైను వేయాలన్నా, పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలన్నా, సీఈటీపీలో పేరుకుపోయిన రసాయన నీటి సమస్య పరిష్కరించాలన్నా అది మున్సిపాలిటీలోని నిధులతోనే ముడిపడి ఉంటుంది. 17 సచివాలయాల పరిధిలోని 14075 అసెస్‌మెంట్లకు గత ఆర్థిక ఏడాదికి రావాల్సిన డిమాండ్లు, బకాయిలు కలిపి రూ.5.32 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అందులో 53.76 శాతం 2.86 కోట్లు మాత్రమే వసూలైంది. రూ.2.46 కోట్లు వసూలు కాక బకాయిలుగా నిలిచింది. మరోవైపు టైమ్‌స్కేల్, ఒప్పంద కార్మికులకు జీతాలకు రూ.5.04 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీంతో నిధుల కొరత ఉండడంతో అధికారులు కూడా తాము ఏం చెయ్యలేమంటూ చేతులెత్తేస్తున్నారు. చివరకు సచివాలయాల నిర్వహణకు కూడా నిధులు లేని పరిస్థితి నెలకొంది. ఎంపీడీఓ కార్యాలయ వీధిలోని సచివాలయం, టీఆర్ కండ్రిగ సచివాలయాల్లో మినహా ప్రింటర్లు పనిచేయడం లేదు. సర్టిఫికెట్లు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలకు సమస్యల కూపంలో చిక్కుకుంటున్నారు.

రసాయన నీరు పోదు

మాన్యువల్ డైయింగ్ యూనిట్లవారు వినియోగించుకున్న చింతలపట్టెడ సీఈటీపీ మరమ్మతులకు లోనై పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. దీంతో ఈటీపీలోని ట్యాంకులన్నీ రసాయన నీటితో నిండి అలాగే నిల్వవుంది. పైగా ప్లాంటు నిర్వహణలో లేకున్నా మాన్యువల్ డైయింగ్ యూనిట్లవారు రసాయన నీరు వదులుతూనే ఉండడంతో అది కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో చేరి నిల్వ ఉంటోంది. ప్లాంటు విద్యుత్ బిల్లు కోట్లలో పేరుకుపోవడం, మరమ్మతులకు మరో కోటి రూపాయల దాకా



పనిచేయని వాటర్ ప్యూరిఫై ప్లాంటు

ఖర్చు చేయాల్సి ఉండడంతో ప్లాంట్లు నిర్వహణ చేపట్టినవారు చేతులెత్తేశారు. తాగునీటికే ఖర్చు చేయలేని మున్సిపాలిటీకి సీఈటీపీ సరిచేసి నిర్వహణకు తెచ్చే స్తోమత లేదు. పారిశుధ్య నిర్వహణకు 29 వార్డులకు సరిపడా సిబ్బంది లేరు. కొత్తగా నియమించుకోవాలంటే నిధులు లేవు. దీంతో పారిశుధ్యం సమస్య కూడా పూర్తిస్థాయిలో పరిష్కరించలేకపోతున్నారు. ఇలా మున్సిపాలిటీ సమస్యల కూపంలో చిక్కుకుంది. పరిష్కార మార్గం చూపాల్సిన ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. రసాయన నీటి సమస్య పరిష్కారమై స్వచ్ఛమైన నీటి కోసం ఎదురుచూపులే ప్రజలకు మిగిలాయి.

స్వచ్ఛ నీటికి కరవు

మున్సిపల్ ప్రజలకు స్వచ్ఛంగా తాగునీరు అందించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో చెత్తాచెదారం నిండుకుంది. మరోవైపు నీటిని శుద్ధికరించి అందించే ప్లాంటులో ఫిల్టర్ బెడ్లు పనిచేయడం లేదు. మోటారు మరమ్మతులకు లోనైంది. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఈ ప్లాంటుకు తరచూ మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. దీంతో మున్సిపాలిటీకి పసుపు రంగులో నీరు సరఫరా అవుతోంది. అలాగే పలు ప్రాంతాలకు మున్సిపల్ తాగునీటి సరఫరా లేదు. వారికి నూతనంగా పైపులైను వేసి తాగు నీరు అందించాలంటే సరిపడా నిధులు లేదు. ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు, ఇసుక మార్పిడికి, మోటారు మరమ్మతులతోపాటు నూతన కనెక్షన్లు ఇవ్వాలంటే సుమారు 80 లక్షలు దాకా ఖర్చవుతుంది. ఈ నిధులు లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అంటూ సమస్యలు మూలనపడ్డాయి.



పసుపు రంగులో వస్తున్న తాగునీరు

డిగ్రీరెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

నగరి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన 2వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ సోమవారం విడుదల చేశారు. కళాశాల స్వయం ప్రతిపత్తి పొందడంతో తామే ఫలితాలు ప్రకటిస్తున్నామన్నారు. అతి తక్కువ సమయంలోనే ఫలితాలు రావడానికి కృషి చేసిన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బృందానికి, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే



ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్న భవిత టీచర్లు

పాలసముద్రం: మండల పరిధిలో ప్రత్యేక అవసరాల గల పిల్లలను సర్వే చేసి గుర్తించాలని ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ తెలిపారు. సోమవారం భవిత కేంద్రం టీచర్లు బాలాజీ, విమల్‌రాజు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల తల్లిదండ్రులు టీచర్లకు సహకరించి మీ పిల్లలను భవిత కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. వారికి ఉచితంగా పాఠ్యపుస్తకం, మధ్యాహ్న భోజనం, ఫిజియోథెరపిస్టు వ్యాయామం వంటి చేయిస్తామని తెలిపారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా కుంభాభిషేక వేడుకలు



కుంభాభిషేక వేడుకల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడలో నూతనంగా నిర్మించిన శరవణ వినాయక ఆలయ కుంభాభిషేక వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో రుద్ర పారాయణం, రుద్రహోమం, లలితా సహస్రనామార్చన, జలాధివాసం, క్షీరాధివాసం, సయాధివాశం, యంత్రప్రతిష్ఠ విమానగోపుర కలశస్థాపన, విశేషహోమాలు, మంగళహారతి వేదస్వస్తి ప్రతిష్ఠ పూజలు, హోమ పూజలు, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శిఖరంపై ఉన్న కళశాలకు కుంభాభిషేక పూజలు చేశారు. కుంభాభిషేక జలం కోసం భక్తులు పోటీ పడ్డారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి ఆర్కే రోజా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, పట్టణ పార్టీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, జిల్లా పార్టీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ వివిధ కమిటీల నాయకుల నాయకులు పాల్గొన్నారు.

పూజారి కుటుంబానికి పరామర్శ

మండలంలోని దామరపాకం ఆలయ పూజారి దుర్గాప్రసాద్ కుమారుడు షణ్ముగ శ్రీనివాస్ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. మాజీమంత్రి రోజా వారి ఇంటికి వెళ్లి షణ్ముగ శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే టీవీ కండ్రిగ గ్రామంలో అనారోగ్యానికి గురైన పార్టీ సీనియర్ నాయకులు గోవిందస్వామిని పరామర్శించారు. కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, వైస్ ఎంపీపీ కన్నప్ప, స్థానిక నాయకులు బుజ్జి రెడ్డి, హరి రెడ్డి, గణపతి శెట్టి, పరంధామ రెడ్డి చంద్రారెడ్డి, గురుమూర్తి, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.



పూజారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్‌కే రోజా

ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీగా చంద్ర



గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీగా పీఎం చంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొన్ని రోజులుగా మండల ఈఓపీఆర్డీగా పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని గంగాధర నెల్లూరు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న చంద్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీగా బాధ్యతలు స్వీకరించారు.

దళిత విద్యార్థిపై దాడి అమానుషం



శ్యామ్‌లాల్

నింద్ర: తిరుపతిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థి జేమ్స్‌పై దాడి చేయడంతో పాటు హత్యాయత్నం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దళిత విద్యార్థిపై కొంత మంది దారుణంగా కొట్టి నోట్లో మూత్రం పోసి హత్యాయత్నం చేయడం దారుణమన్నారు.

నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్ రెడ్డి

నగరి: మండలంలోని తెరణి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గురవయ్య, మున్సిపల్ పరిధిలోని కేవీపీఆర్‌పేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మణిగండన్, భాస్కర్ తల్లి సంపూర్ణమ్మ సోమవారం మృతిచెందారు. మృతుల స్వగృహాలకు వెళ్లిన మాజీ మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి మృతదేహాలపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట ఎంపీటీసీ యేసు, నాయకులు బాలకృష్ణ, కన్నాయిరం, మురుగ తదితరులు పాల్గొన్నారు.

తిరుగుబాటుకు సిద్ధమైన టీచర్లు



పోరాటానికి సిద్ధమైన ఉపాధ్యాయ సంఘ నేతలు

పుత్తూరు: గత ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా సంస్కరణలను రద్దుచేస్తూ చంద్రబాబు కొత్తగా అమలు చేస్తున్న విద్యా విధానాలపై ఉపాధ్యాయులు తిరుగుబాటుకు సిద్ధమైనారు. ఈనెల 21వ తేదీన చిత్తూరు డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాలు ప్రకటించాయి. సోమవారం స్థానిక పెన్షనర్స్ భవనంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ 117 జీఓను రద్దు చేసినట్లు ప్రకటించిన ప్రభుత్వం ఆశించిన ఫలితాలు చూపలేదని ఆరోపించారు. గతంలో 6 రకాల పాఠశాలలు ఉండగా వాటిని 9కి పెంచి విద్యార్థులపై ఒత్తిడిని తీసుకొస్తున్నారని ఆరోపించారు. దీంతో పెద్దఎత్తున బాలికలు నిరక్షరాస్యులుగా మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. టీచర్ల బదిలీలలోనూ నిబంధనలు అసంబద్ధంగా ఉన్నాయని, వాటిని తొలగించాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఈనెల 21న డీఈఓ కార్యాలయ ముట్టడిని టీచర్లు విజయవంతం చేయా లని పిలుపునిచ్చారు. సమావేశంలో యూటీఎఫ్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్, పీఆర్టీయూ, ఆపస్, హెచ్ఎమ్స్ అసోసియేషన్, పీడీల అసోసియేషన్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ సాయం



బాధిత కుటుంబానికి నగదు, సరుకులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెదురుకుప్పం: మండలంలోని బండమీద ఇండ్లు గ్రామంలో ఇంటిపై పిడుగు పడి నష్టపోయిన కుటుంబానికి వైఎస్సార్‌సీపీ సాయం అందించింది. గ్రామానికి చెందిన శ్యామల ఇంటిపై శనివారం సాయంత్రం పిడుగుపడి ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఈకారణంగా ఇంట్లో వస్తువులు కాలిపోవడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు స్పందించారు. సోమవారం మధ్యాహ్నం జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, వైఎస్సార్‌సీపీ కార్యనిర్వాహక కార్యదర్శి రామయ్య, ప్రచారకమిటీ జిల్లా అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్ రెడ్డి గ్రామంలో పర్యటించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధితులకు రూ.10 వేలు నగదు అందజేశారు. అదేవిధంగా బియ్యం, వంట సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి బొజ్జారెడ్డి, మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి, మాజీ ఎంపీటీసీ జయమ్మ, బోడిరెడ్డి నరేష్ రెడ్డి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

వెదురుకుప్పం: లబ్ధిదారులు గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ పురుషోత్తం ఆదేశించారు. సోమవారం ఆయన మండలంలోని బ్రాహ్మణపల్లె పంచాయతీ మహేశ్వరపురం ఎస్టీ కాలనీని సందర్శించారు. ఈసందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. వెంటనే అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తి చేయాలన్నారు. అదే విధంగా బ్రాహ్మణపల్లె, దిగువ బ్రాహ్మణపల్లె గ్రామాల్లో నీళ్ల ట్యాంకును పరిశీలించారు. అనంతరం బండమీద ఇండ్లలో పిడుగు పడి పాక్షికంగా ధ్వంసమైన ఇంటిని పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటామని చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ మోహన్‌కుమార్, బ్రాహ్మణపల్లె కార్యదర్శి ప్రకాష్, మొండివెంగనపల్లె కార్యదర్శి మునికృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ యువరాజ్ ఉన్నారు.

అలరించిన అర్జున తపస్సు





తపస్సుమానును అధిరోహిస్తున్న అర్జున వేషధారి, హరికథను ఆలకిస్తున్న ఎంసీ విజయానందరెడ్డి

శ్రీరంగరాజపురం: మండల పరిధిలోని 49 కొత్తపల్లి మిట్టలో జరుగుతున్న శ్రీద్రౌపదీదేవీ సమేత ధర్మరాజుల వారి మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన అర్జున తపస్సు భక్తులను ఆకట్టుకుంది. అర్జున వేషధారి, తపస్సు ఘట్టానికి సంబంధించిన పద్యాలను ఆలపిస్తూ తపస్సుమానును అధిరోహించారు. ఈక్రమంలో విబూధి, నిమ్మ పండ్లను కిందకు విసరగా వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధికి కానుకలు సమర్పించి, భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉభయదారులుగా ఆలయ ధర్మకర్త నాగరాజు, సునీల్, రమణ, సోమశేఖర్, సతీష్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, జిల్లా క్రియాశీలక కార్యదర్శి విజయబాబు, ఎంపీటీసీ సభ్యులు కోటిరెడ్డిబాబు, నాయకులు శ్యామ్, సైకిలా, యుగంధర్, గోవిందరెడ్డి, సుధ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేపై సమీక్ష

పాలసముద్రం: మండల పరిధిలోని జరుగుతున్న రీసర్వే చేసే రెవెన్యూ గ్రామాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా రీసర్వే చేయాలని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తమ సిబ్బందికి ఆమె సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ అరుణకుమారి మాట్లాడుతూ విలేజ్ సర్వేయర్, వీఆర్‌ఓ రీసర్వేకి వెళ్లినప్పుడు రైతుల రికార్డులను పరిశీలించి సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వైభవం.. ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

కార్వేటినగరం: రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం వైభవంగా జరిగింది. సోమవారం ఉదయం తొలిగంటలో నైవేద్యం సమర్పించారు. 6 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడు సర్వసైన్యాధ్యక్షుడు విశ్వక్సేనుడితో కలసి మాడవీధుల్లో ఊరేగింపునకు బయలుదేరారు. లోకకల్యాణం కోసం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా జరగడానికి విశ్వక్సేనుడు అష్ట దిక్పాలకులను ఆహ్వానించి ఆలయ మాడవీధుల్లో నిర్వహించే కార్యక్రమాన్ని కంకణ భట్టర్ తరుణ్‌కుమార్ చేపట్టారు. అనంతరం 9.15 గంటల నుంచి 9.45 మధ్య మిథునలగ్నంలో గరుడాళ్వార్ చిత్రపటం ఉన్న వస్త్రాన్ని ధ్వజస్తంభంపైకి అధిరోహించారు.

అలరించిన సంగీత కచేరీ..

టీటీడీ ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిర్ వారు నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. వివిధ రకాలైన భక్తిగీతాలను ఆలపించి స్వామివారిని పరవశింప చేశారు.

పెద్దశేషవాహనంపై స్వామివారి కటాక్షం..

మొదటి రోజు సోమవారం రాత్రి ఉభయ నాంచారులతో పాటు వేణుగోపాలుడు పెద్దశేషవాహనంపై పురవీధుల్లో ఊరేగారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబుసురేష్, కంకణభట్టర్ తరుణ్‌కుమార్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చిన్నశేష వాహనంపై స్వామివారు..

మంగళవారం ఉదయం స్వామివారు ఉభయ దేవేరులతో పాటు చిన్నశేష వాహనంపై, రాత్రి హంస వాహనంపై పురవీధుల్లో ఊరేగనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు.

వనదుర్గాపురంలో సినిమా షూటింగ్



షూటింగ్ ప్రారంభిస్తున్న స్థానిక నేతలు

పాలసముద్రం: మండలంలోని వనదుర్గాపురంలో నూతన సినిమా షూటింగ్ ప్రారంభమైంది. బలిజ కండ్రిగ గ్రామానికి చెందిన మునస్వామి క్లాప్ కొట్టగా, పాలసముద్రం కదిరివేలు కెమెరా ఆన్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. వనదుర్గాపురానికి చెందిన రాజేంద్రబాబు నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాను ఆర్‌బీ ప్రొడక్షన్‌లో నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో సినిమా తీస్తున్నామని, ఇందులో హీరోహీరోయిన్లుగా విజయరాజ, రాధ్య కృష్ణమూర్తి నటిస్తున్నట్లు తెలిపారు. సినిమాకు డైరెక్టర్‌గా బాలు నాగరాజు, స్క్రీన్‌ప్లే రాజేంద్రబాబు, యువన్‌శంకర్ రాజా సంగీతం అందిస్తున్నట్లు చెప్పారు. సినిమా షూటింగ్‌ను చూసేందుకు స్థానికులతో పాటు తమిళనాడు వాసులు వచ్చారు.

పార్టీకి తీరని లోటు

పుత్తూరు: నగరి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లక్ష్మణమూర్తి సమీప బంధువు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగి గోవిందరాజులు మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ పుత్తూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు అన్నా లోకనాథం అన్నారు. సోమవారం ఆయన వేపగుంట దళితవాడలో గోవిందరాజులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు పలువురు నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి



సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సమాచార హక్కుల వేదిక సభ్యులు

పుత్తూరు: బడుగు, బలహీన వర్గాల కోసం అహర్నిశలు పోరాటం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని సమాచార హక్కుల వేదిక సంఘం కార్యదర్శి వర్గ సభ్యురాలు హేమలత అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య నగర్‌లో కమ్యూనిస్టు ఉద్యమ పితామహుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘ కార్యదర్శి కె.మురగారెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పక్షాన పోరాటం చేసిన సుందరయ్యను ఆదర్శంగా తీసుకుని చేసిన పోరాట ఫలితంగా దక్కిన ఈ కాలనీకి ఆయన పేరు పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.